# రాదే చెలీ! నమ్మరాదే చెలీ!

అరుగులు చాలా మంచివి, అంటే తలుపులు చెడ్డవనికాదు. పడుచుపిల్ల కొత్తచీర కట్టుకుని తలుపు దగ్గర నిలుచుంటే ఆ తలుపుకాస్త ఓర వాకిలిగా తీసివుంటే చూడ్డానికి ఎంతో బావుంటుంది.

తలుపవతల ఏముందో.... ఊహించుకుంటే బలే తమాషాగా ఉంటుంది. పిల్లడిని వొళ్లోవేసుకొని అరుగుమీద కూర్చుని పాలిస్తూ లోకాభిరామాయణం చెప్పుకునే తల్లిని చూడ్డం నాకెంతో ఇష్టం అన్నారు మీరు గుర్తుందా? అలాగే... కిటికీలూ, కిటికీ తలుపులూ....అవి మూసుకుంటాయి. తెరుచుకుంటాయి.

హృదయ కవాటాలు అంతేగా -

గోడలంటే నాకు గిట్టదు అన్నారు మీరు.

కోడలంటే అత్తకు గిట్టదు.

కోడలికి కొడుకు పుడితే బాగుంటుంది.

గోడలకి కిటికీలుండటం కాస్తలో కాస్త మెరుగే అనిపిస్తుంది నాకు.

గోడలమధ్య చేసే పాపాలకి కిటికీలు ప్రాయశ్చిత్తం అంటారు మీరు. నాకు బోధపడలేదు.

చక్కని తోటకు చుట్టూ ముళ్ళ కంచె -

కాస్త సరదాగా నవ్వుతూ తుళ్లుతూ వుండే పిల్లకు ఖడ్గమృగం లాంటి మొగుడు.

పళ్ళ చెట్టుకు ముళ్ళకంప - ప్రహరీగోడలకు గాజు పెంకులూ చూస్తోంటే యమచిరాగ్గా వుంటుంది.

కిటికీలకంటె ద్వారబంధాలు కాస్త మెరుగు.

బయటికి పోవచ్చు - లోపలికి రావచ్చు.

ఎవరెవరో ఎక్కడెక్కడ్నుంచో వస్తారు, పోతారు. తలుపులు వేసుంటే తప్ప సరుకూ, జప్పరా, నగలూ నట్రా, బట్టలుపెట్టె, నానా సామానూ బయటకు నడవవచ్చు. అలాగే ఐశ్వర్యం కీర్తి ప్రతిష్ఠా లోపలికి రావచ్చు. లోపలున్నవి బయటకు పోవచ్చు!

యస్ - నో. ఆల్ రైట్!

కిటికీలు మంచివి. కిటికీలోంచి చూడొచ్చు; చూస్తూ ఆశలతో కాలం గడపవచ్చు.

గాలీ వెల్తూరూ వస్తుంది. ఇంట్లోంచి పూచిక పుల్ల బైటికి పోదు. అరుగుమీద కూర్చుని వీధికేసి చూస్తుంటే (అందుకనే ఆడవాళ్ళు గుమ్మాలదగ్గర నించుంటారు. గుమ్మాల దగ్గర అడవాళ్ళు నిల్చుంటే గుమ్మాలు అందంగా వుంటాయి)అటూ ఇటూ నడిచే మనుష్యులు సైకిళ్ళు రిక్షాలు, కూరల వాళ్ళూ, పళ్ళవాళ్ళూ, బుట్టల వాళ్ళు, తట్టల వాళ్ళు అంతా వండర్ ఫుల్‌గా వుంటుంది. మా నాన్న నన్ను గుమ్మం దగ్గర నిల్చుంటే వీపు చీరేస్తానన్నాడు. ఎప్పుడు?

పధ్నాలుగో ఏట.... పధ్నాలుగేళ్ళ ఆడపిల్ల గుమ్మందగ్గర నిల్చుంటే కవులూ కుర్రవాళ్లూ హర్షిస్తారేమో కాని తల్లిదండ్రులు హర్షించరు. కడుంగడు దుఃఖిస్తారు. ఒకచో వీపు చీరేస్తానని బెదిరించటం కూడా కద్దు; వీపు చీరడమంటే... ఊహించుకున్న మాత్రం చేత ఒళ్లు కంపరమెత్తి పోతోంది. ఏమండీ–మీ నాన్న గారు పోనీ ఇంకెవరైనా పెద్దలు మీ వీపు ఎప్పుడన్నా చీరేశారా? క్షమించండి; ఒంట్లో బాగులేదు. ఇవాళేదో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాను. తీరా పెళ్ళయి ఇన్నేళ్ళయాక మీ చిన్నప్పటి ప్రవర్తన మీద ఇప్పుడు నాకు కోపం వస్తోంది. ఈ వయసులోనే నుండి మీరు అప్పటి చిన్న ఇస్కూలు కుర్రవాడి రూపంలో వుంటే చెవులు మెలిపెట్టేద్దును. వీపుమీద గుద్దులు గుద్దుదును. బుగ్గలు గిల్లేసి మీచేత గోడకుర్చీ వేయించే దాన్ని ఎందుకని? ఎందుకని అడగరేం? మీరు చిన్నప్పుడు ఇంట్లోంచి డబ్బులెత్తుకుపోయేవారట. పెట్లోంచి నోట్లు కాజేసే వారట మానాన్న రిస్టువాచీ మీరే కాజేసార్ట.... చిన్నప్పుడు దొంగ ఇప్పుడు పెద్దమనిషి అయిన మిమ్మల్ని ఎలా శిక్షించడం అప్పుడు జేబిలో డబ్బు? పెట్లో నోట్లు, రిస్టు వాచీలు కాజేసి తరవాత ఆడపిల్లల హృదయాల జోలికి మటుకు వెళ్ళరనీ వెళ్ళలేదనీ రుజువేమిటి? అసలు మీ మగవాళ్ళను నమ్మ పనిలేదు.

శ్రీరామచంద్రుడొక్కడూ లేదు.

ఈవాళ ఇదేమిటిలావస్తున్నాయి ఆలోచన్లు? చెవుల్లో హోరు సముద్రపొడ్డున నించున్నట్లుంది.

ఒడ్డున నించున్న దాన్ని చిన్నదాన్ని సముద్రంలోకి తోశారు పెద్దవాళ్ళు.

ఈత్తున్నాను సంసారం – మిహిర్ సేను అనే లాయరు కుర్రాడు సముద్రాల్ని యీదేట్ట! ఏమాచ్చెర్యం? మేస్టరీ గిరీ చేసి, ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి, పిల్లలకు చదువులు చెప్పించి – ఏ ఎండకాగొడుగు పట్టి రోగాలకు డాక్టర్ల చుట్టూ తిరిగి బ్రతికి బట్ట కట్టి గుది బండ సంసారాన్ని ఓ ఒడ్డుకు చేర్చిన సంసారికి ఏ బిరుదులూ యివ్వరే? కాలవలు ఈది గోడలు దూకడం గొప్ప పనులయితే సంసారాల్ని ఈదడం గొప్పకాదూ? బ్రతకటం గొప్పకాదు? ఎన్ని సర్కసు ఫీట్లు చేయకుండా జీవితం వెళ్తుందీ? కాదు – కాదు జీవించటం గొప్పకాదు. సర్కసు ఫీట్లు చేయడమే గొప్ప.... నా మనసేమిటి? చాకులా యింత పదునుగా వుందీ? మాటలేవిటి – ఇలా బాకుల్లా దూసుకు వస్తున్నాయి. గాలీ వెల్తూరూ చొరని చీకటి కొట్లో బంధించిన ఆడదాని మనసులోని ఊహల్లా.... పరిగెట్టుకు ఒకటి వెంటొకటి రవిలు పెట్టిల్లా త్రోసుకువస్తున్నాయ్ః?

ఎవరుచెప్మా నా ముందు నిల్చుంది?

శ్రీవారు మీరే...మీరే...మీరా?

వైదుయు కంలేట్?

నాకు టెంపరేచర్ ఎక్కువగావుంది. జ్వరం తీవ్రంగా ఉన్నట్లుంది.

జ్వరతీవ్రత వల్ల ఏం మాట్లాడ కూడదో నాకు తెలియడం లేదు. పుచ్చుగున్నాను. పుచ్చుగున్నాను. మీరు తెచ్చిన మందు. కథల్రాసే డాక్టరుగారి దగ్గిరనుంచి మీరు తెచ్చిన

మందు - అలమార్లో పుస్తకాల వెనుక నాకోసం తెచ్చి దాచిన సీసాలోని మందు ముక్కు మూసుకుని కళ్ళు తెరచి గటగటా త్రాగేశాను.

అంత మంచి మందిచ్చిన కథల డాక్టరుగారికి వెరీ మెనీ థాంక్స్ గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది మనసున మల్లెల మాల లూగెనే....

ఏవిటీ? ఏవిటా చిందులు? ఏమా చిరాకు -

అది నా మందు కాదా? నా కోసం మీరసలు మందు పత్రాలేదా? తెచ్చారునాన్నగారు గూట్లో పుస్తకాల వెనక పెద్ద సీసాడు మందు తెచ్చారు అన్నాడు రాముగాడు. ఆ వెధవే నండీ మంచి నీళ్ళ గ్లాసుతో గ్లాసుడు మందు త్రాగమ్మా జ్వరం పోతుంది అని తెచ్చి ఇచ్చాడు. మరి ఇంతకీ - ఈ సీసా యిది నా కోసం తెచ్చిన మందుకాదా? లావుపాటి పుస్తకాల వెనక దీన్ని ఎవరు పెట్టారు చెప్మా?

---

# తారుమారు బలే పెళ్ళి

నేను కోనసీమ పిల్లని. మీ పెత్తల్లిది కోనసీమ. మా అమ్మ సరేసరి - కోనసీమ వారి ఆడపడుచు. ఎందుకలా నవ్వుతారు? ఏమనుకుంటున్నారో "కోనసీమ" అంటే "కోటి రత్నాల సీమ"

మిమ్మల్నేమో పెద్దమనిషి అనుకొని మావేలువిడచిన అన్నయ్య కోనసీమ పెళ్ళికి పిలిస్తే ఆడపెళ్ళివారి తరపున వచ్చి తగుదునమ్మా అని మొగపెళ్ళి వారిని "మట్టిమనుష్యులు" అన్నారట మీరు. మావాళ్ళంటే మీ కంత వేళాకోళాలుటండీ మరీనూ; మగపెళ్ళి వారికోసం చేయించి తెచ్చిన "పూతరేకులు" బస్సులో పిల్లలకు పైగా పంచిపెట్టించేసి, మినపసున్ని ఉండలు, లడ్లు పెట్టిన డబ్బాలు ఎక్కడున్నాయో పిల్లలకు చూపించేశారుట;

సరదాకైనా ఓ హద్దూ పద్దూ ఉండాలి.

మా మార్కెండేయులు అన్నయ్యని "పాప్మాగుడు" - "మిస్టర్ మార్క్" అని ఎగతాళి పట్టించారట కదా;

కాగితాల మీద ఏదో బరుకుతారుగదా అని మిమ్మల్ని మావాళ్ళు "జెంటిల్మాను"గా చూస్తోంటే వాళ్ళని మట్టి మనుష్యులు అనడం ఏం బావుందీ?

మీ చెల్లెలు గీచిన గీటుదాటడు మా అన్నయ్య. చదువుకున్న దానిననీ, అందమైన దానిననీ, అప్ టు డేటు గరల్ననీ "మీరజారగలడా నా యానతి" అన్నట్లు నా మొగుడు నా మాట జవదాటడనీ దాని కెంత ధీమా? గర్వం? మా అన్నయ్యకు ముక్కుకు తాడుకట్టి ఆడించే మీ